సాక్షి
వికారాబాద్
సోమవారం, 2, సెప్టెంబర్, 2024



ఆస్పత్రి నిర్మాణానికి కృషి

ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



రుద్రారం చోరీని ఛేదిస్తాం

రుద్రారంలో జరిగిన చోరీ కేసును త్వరలోనే ఛేదిస్తామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. 8లో▸



పాలన సాగేదెట్లా?

అధికారుల నిర్లక్ష్యంతో పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

రేపు కొడంగల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్

వర్షాకాలం నేపథ్యంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర విషయాలపై ఫోన్ ఇన్ ద్వారా ఆస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: డెంగీ, చికున్‌గున్యా, తదితర సీజనల్ వ్యాధులు
డాక్టర్: చంద్రప్రియ, సూపరింటెండెంట్, కొడంగల్ ప్రభుత్వాస్పత్రి
తేదీ: 3-09-2024 (మంగళవారం)
సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
90529 93058, 98861 06290, 91777 77235

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు
కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, ఎయిడెడ్ పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



తాండూరు: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు వంకలు పొంగిపొర్లుతోన్నాయని వాగులు దాటేందుకు యత్నించొద్దన్నారు. పాత భవనాలు, మట్టి ఇళ్లు వర్షాలకు కూలిపోయే ప్రమాదాలున్నాయన్నారు. అలాంటి ఇళ్లలో ఉండకుండా సురక్షితమైన ప్రదేశంలో ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామీణ యువత అధికారులకు సహకరించాలన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఆంజనేయులు



ఆంజనేయులును సన్మానిస్తున్న సభ్యులు

అనంతగిరి: పద్మశాలి సంఘం వికారాబాద్ నియోజకవర్గ సంఘం అధ్యక్షుడిగా వనంపల్లి ఆంజనేయులు ఎన్నియ్యారు. ఆదివారం పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆంజనేయులు సమీప అభ్యర్థి మల్లేశంపై 95 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. సంఘం అభ్యున్నతికి పాటుపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మధూకర్, లక్ష్మణ్, వెంకటేష్, శంకరయ్య, జనార్ధన్, మురళీధర్, సుదర్శన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి
టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

అనంతగిరి: సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎస్ విద్రోహ దినం సందర్భంగా వికారాబాద్ పట్టణంలో సీపీఎస్ జేఏసీ జిల్లా సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింలు, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షుడు హీరాలాల్, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రత్నం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకుడు మధూకర్, గెజిటెడ్ సంఘం, పెన్షనర్ సంఘం తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ధారూరు: అలుగు పారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

కుండపోత

జిల్లా వ్యాప్తంగా దంచికొట్టిన వాన

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు
- ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం
- ప్రాజెక్టుల్లోకి భారీగా చేరుతున్న వరద
- నీటమునిగిన పంటపొలాలు
- ధ్వంసమైన రహదారులు
- నిలిచిన రాకపోకలు
- స్తంభించిన జనజీవనం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- టోల్ ఫ్రీ నంబర్ 08416242136

వికారాబాద్: రెండు రోజుల క్రితం ప్రారంభమైన వర్షం జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. గడిచిన 24గంటలుగా మరింత ఉధృతంగా మారడంతో జనజీవనం స్తంభించింది. శుక్రవారం రాత్రి ప్రారంభమైన వర్షం శని, ఆదివారం రాత్రి వరకు అంతరాయం లేకుండా కురిసింది. ఈ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగాయి. చెరువులు, కుంటలు నిండి అలుగు పారాయి. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు భారీగా వరద నీరు చేరుతోంది. రోడ్లపై వరదలు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గడిచిన 24 గంటల్లో కొడంగల్‌లో అత్యధికంగా 122.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవ్వగా.. జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు.

50కి పైగా డేంజర్ స్పాట్స్

జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సమీక్షించారు. కలెక్టర్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎస్పీ టెలీకాన్ఫరెన్స్ ద్వారా తమ సిబ్బందిని పోలీసు అధికారులను అప్రమత్తం చేయటంతో పాటు పలు సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లు, బ్రిడ్జిలను కలిపి 50కిపైగా డేంజర్ స్పాట్స్‌గా గుర్తించారు. ప్రమాద స్థలాలు ప్రకటించిన ప్రదేశాల్లో రెవెన్యూ, పోలీసులు కాపలాగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. వర్షాలు తగ్గే వరకు బయటకు రావద్దని.. ప్రమాదంగా ఉన్న దగ్గర వాగులు దాటేందుకు ప్రయత్నించొద్దని దండోరా వేయించాలని యంత్రంగానికి సూచించారు. అవసరమైతే బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోట్‌పల్లి, లఖ్నాపూర్, జుంటుపల్లి, శివసాగర్, శివారెడ్డిపేట్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. కోట్‌పల్లి, శివసాగర్ ప్రాజెక్టులు అలుగు పారుతుండడంతో క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పలు చోట్ల ఇళ్లు కూలిపోయాయి.

గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం

మండలం	నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
మర్పల్లి	34.2
మోమిన్‌పేట్	99.7
నవాబుపేట	81.8
వికారాబాద్	79.1
పూడూరు	73.2
పరిగి	40.1
కుల్కచర్ల	104.1
దోమ	94.2
బొంరాస్‌పేట్	88.2
ధారూరు	80.4
కోట్‌పల్లి	65.3
బంట్వారం	47.9
పెద్దేముల్	72.4
తాండూరు	102.2
బషీరాబాద్	106.4
యాలాల్	107.1
కొడంగల్	122.6
దౌల్తాబాద్	109.2
చౌడాపూర్	94.5
దుద్యాల	96
మొత్తం సగటు	84.9

స్తంభించిన రవాణా

- కాగ్నా, మూసీ, ఈసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాలు, రైతులు, పాదచారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- ధారూరు మండలం దోర్నాల, రుద్రారం, నాగసముందర్, పరిగి, గొడుగోనిపల్లి, గెర్‌గేట్‌పల్లి, ధన్నారం వైపు వెళ్లే దారుల్లో వాగులు బ్రిడ్జీలపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు బందయ్యాయి.
- బంట్వారం మండల పరిధిలో నూర్లపూర్ వాగు పొంగిపొర్లడంతో వాహనాలు నిలిచిపోయాయి.
- తాండూరు నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలకు కాగ్నా పరవళ్లు తొక్కుతోంది. బషీరాబాద్, యాలాల్, తాండూరు మండలాల్లో కాగ్నా ఉధృతికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- వర్షం తాకిడికి రోడ్లు పాడయ్యాయి. వందల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి.
- వికారాబాద్, తాండూర్, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు పట్టణాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

కంట్రోల్ రూం ఏర్పాటు



వర్షాలు కురుస్తున్నందున ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారులందరినీ అప్రమత్తం చేశాం. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొంటాం. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి అత్యవసర పరిస్థితిలోనైనా ప్రజలు 08416242136 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు. జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులను అప్రమత్తం చేశాం.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్, వికారాబాద్

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



ప్రజలకు ఏ అవసరం వచ్చినా ఆదుకునేందుకు పోలీసు శాఖ నుంచి అన్ని చర్యలు తీసుకుంటున్నాం అత్యవసర పరిస్థితిలో డయల్ 100కు ఫోన్ చేయండి. ఉధృతంగా ప్రవహించే అన్ని వాగుల వద్ద, ప్రాజెక్టుల వద్ద పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. కరెంటు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వాగులు దాటకూడదు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలున్నవారు వాన తగ్గేవరకు దూరంగా ఉండాలి. కరెంట్ పోల్స్ ఒరిగినా, విద్యుత్ తీగలు తెగి పడినా, వంతెనలు తెగిపోయినా, రోడ్లు కొట్టుకుపోయినా సంబంధిత శాఖల అధికారులతో పాటు ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీసులకు వెంటనే సమాచారం అందించాలి.

– నారాయణరెడ్డి, ఎస్పీ, వికారాబాద్



అనంతగిరి: మత్తడి దూకుతున్న సర్పన్‌పల్లి ప్రాజెక్టు



దౌల్తాబాద్: నీట మునిగిన కంది పంట



యాలాల: అలుగు పారుతున్న శివసాగర్ ప్రాజెక్టు



పరిగి–వికారాబాద్ మార్గంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వాగు



రుద్రారం–నాగసమందర్ మార్గాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అధికారులు

రాకపోకలు నిషేధం

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు: మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టునుంచి అలుగు పారుతున్న రోడ్డును ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. ముందుగా మండల పరిధిలోని రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్య ప్రాజెక్టు అలుగునీరు ప్రవహిస్తున్న మార్గాన్ని పరిశీలించి అటుగా ఎవరూ రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టు వద్దకు చేరుకుని అలుగు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలించారు. వరద ఉధృతి తగ్గే వరకు పర్యాటకులను అనుమతించవద్దన్నారు. స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కాగ్నానది తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్‌ను ముంచేసిందని నదిని దాటే సాహసం చేయొద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, ఎంపీఓ షఫీఉల్లా తదితరులున్నారు.

రైతు సమస్యలపై ఐక్య పోరాటం



మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్

అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులకు ద్రోహం చేసిన ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాజకీయ శిక్షణ తరగతులు రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని చింతపల్లిగూడ గేటు సమీపంలో గల శుభం కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్నాయి. రెండోరోజు తరగతుల్లో భాగంగా 'వ్యవసాయ రంగం సవాళ్లు– ప్రత్యామ్నాయం' అంశంపై నిర్వహించిన సదస్సులో డాక్టర్ విజ్జు కృష్ణన్ మాట్లాడారు. అఖిల భారత రైతు సంఘాలు దేశా వ్యాప్తంగా చేసిన పోరాటంలో 738 మంది రైతులను చంపిన చరిత్ర బీజేపీ సర్కార్‌కే దక్కిందన్నారు. రైతుల పోరాటానికి స్పందించి ఏడాది తర్వాత మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 158 సీట్లకే బీజేపీ పరిమితమైందని, ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం చంద్రబాబునాయుడు, నితీష్ సహకారంతో వెంటిలేటర్‌పై కొనసాగుతోందన్నారు. పదేళ్ల కాలంలో 1.12 లక్షల మంది రైతులు, 3.20 లక్షల మంది వలస కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాయమాటలు చెప్పి 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. తెలంగాణలో పత్తికి మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. రూ.16వేలు ఇవ్వాల్సిన మద్దతు ధర రూ.6,600కే పరిమితమైందన్నారు. రైతు సమస్యలపై మరోసారి ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. నవంబర్ 15–25 వరకు గ్రామాల్లో క్యాంపెనింగ్, 26న ఢిల్లీలో రైతులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాడిగళ్ల భాస్కర్, రామకృష్ణారెడ్డి, మునలయ్య, పంది జంగయ్య, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి..

బాలుడి మృతి



ఆరీఫ్ మృతదేహం

షాద్‌నగర్: ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ బాలుడు మృతి చెందిన విషాదకర సంఘటన షాద్‌నగర్ పట్టణంలోని నోబుల్ పార్కు కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన మీర్ అహ్మద్, రోషన్ దంపతులు. వారికి కుమారుడు ఆరీఫ్ (13 నెలలు) ఉన్నాడు. ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో ఇంటి ముందు ఆరీఫ్ గంతులేస్తూ ఆడుకుంటున్నాడు. ఇంటి ముందు ఉన్న గుంతలో వర్షం నీరు భారీగా చేరడంతో బాలుడు ప్రమాదవశాత్తు ఆడుకుంటూ వెళ్లి అందులో పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆరీఫ్‌ను బయటికి తీసి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాచన్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు

షాబాద్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రస్తుత సమాజంలో అందరికీ గౌరవం దక్కుతుందని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచన్‌పల్లిలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి తెలంగాణ గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని సాయిచంద్, వెన్నెల గద్దర్, బేగరి రాజుతోతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని, ఆయన రచించిన రాజ్యాంగంతోనే నేడు అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అంబేడ్కర్ వల్లే మహిళలకు రిజర్వేషన్లు, అన్ని కులాలకు సమాన హక్కులు దక్కాయని తెలిపారు. తెలంగాణ గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని సాయిచంద్, వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేదర్‌రెడ్డి, ఎన్. రాంరెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్యరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌రెడ్డి, సత్తయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు రాములు, మాణిక్యరెడ్డి, యాదయ్య, సుమన్, శ్రీను, విఠల్, మహేందర్, మండల నాయకులు రవీందర్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనంతగిరి అందాలు



గుట్టల మధ్యలో ప్రవహిస్తున్న వర్షం నీరు

అనంతగిరి: భారీ వర్షాలకు అనంతగిరి గుట్టల్లో కొండలపై నుంచి నీరు కిందికి దూకుతూ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తూ ఆకట్టుకుంటుంది. భారీ వర్షాలు కురుస్తున్నందున పర్యాటకులను అడవిలోకి అనుమతించడం లేదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

అన్నదాత ఆందోళన



చౌడాపూర్‌లో నీటమునిగిన వరి

కుల్కచర్ల: భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుతున్నప్పటికీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నిరోజుల క్రితమే వరి, జొన్న పంటలు వేసిన రైతులు పైరు నల్లగా మారుతుండటం, నీరు ఎక్కువై ఊటుపడుతుంటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారంరోజుల వరకు వర్షాల కోసం ఎదురుచూసిన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోతున్నాయని దిగాలు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని ఆవేదన చెందుతున్నారు. చౌడాపూర్ గ్రామ పరిధిలో పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. వరద ఉధృతి పెరగనుండటంతో పంటలపై రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి.

రాఖీ కట్టేందుకు వెళ్లిన మహిళ అదృశ్యం



పద్మ(ఫైల్)

పరిగి: రాఖీ కట్టేందుకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన రూప్‌ఖాన్‌పేట్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన కుక్క పద్మ ఆగస్టు 19న తన అన్నలకు రాఖీ కట్టి వస్తానని చెప్పి పరిగి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. నగరంలోని ఆరె మైసమ్మ ఆలయం వద్ద ఉందని సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లి వెతికినా ఫలితం శూన్యం. దీంతో ఆమె భర్త వెంకటయ్య ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేపలకోసం వెళ్లి.. శవమై తేలి



శేఖర్ మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: చేపలకోసం చెరువులోకి వెళ్లిన వ్యక్తి విగతజీవిగా మారాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామశివారులో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. దేవునిపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి శేఖర్ (35) ఆదివారం గ్రామ శివారులోని పల్లం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువులోకి భారీగా వరదనీరు చేరింది. శేఖర్ చెరువులోకి దిగుతుండగా లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో చెరువు నీటిలో మునిగిపోయాడు. అదే సమయంలో కొంతమంది గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ విజయకుమార్ రెవెన్యూ అధికారులు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. శేఖర్ మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి బావ రాగరి బుడ్డయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కొడంగల్ రూరల్: గుండ్లకుంట రహదారిలో కంది పంటలో వరద



తాండూరు టౌన్: శాంతినగర్ కాలనీలో నిలిచిన వరద నీరు



దౌల్తాబాద్: తిర్మాలాపూర్‌లో కూలిన ఇల్లు



కొడంగల్ రూరల్: పట్టణ శివారులో కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

వాన.. హైరానా

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల వరద ప్రవాహానికి రోడ్లు తెగిపోయి రాకపోకలు స్తంభించాయి. ఇళ్లలోకి నీరుచేరి బిక్కుబిక్కుమంటూ గడిపారు. పాత ఇండ్లు కూలిపోయాయి. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



దుద్యాల్: కుదురుమల్ల-దౌల్తాబాద్ మార్గంలో దారికి అడ్డుగా వేసిన కంచె



దుద్యాల్: కుదురుమల్లలో కూలిన కిరాణ దుకాణం



తాండూరు టౌన్: తాండూరు -హైదరాబాద్ మార్గంలో నిలిచిన వరద



తాండూరు టౌన్: నంబర్‌వన్ పాఠశాల సమీపంలో..



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో పాడైన టమాటా పంట



దుద్యాల్: హస్నాబాద్ సమీపంలో చెరువును తలపిస్తున్న వరి పొలం



దౌల్తాబాద్: నందారం చెరువు నుంచి ప్రవహిస్తున్న వరద



యాలాల: కోకట్ కాగ్నా బ్రిడ్జి ఎగువన బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ శంకర్ తదితరులు



దౌల్తాబాద్: అలుగు పారుతున్న బాలంపేట చెరువు



దౌల్తాబాద్: చింతల్ చెరువు వద్ద వాగు దాటుతున్న రైతులు



తాండూరు టౌన్: ఆదర్శనగర్ కాలనీలో నిలిచిన వరద



అనంతగిరి: ధన్నారం వాగు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న లింగ్యానాయక్, ఆర్డీఓ తదితరులు



అనంతగిరి: గొట్టిముక్కల పరిస్థితిని సమీక్షిస్తున్న సీఐ నాగరాజు



మోమిన్‌పేట: చంద్రశేఖర్ నగర్ కాలనీలో కూలిన నివాసం



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో పూలతోటలోకి చేరిన వరద



యాలాల: హాజీపూర్‌లో ఇంట్లోకి చేరిన వరద

ఆస్పత్రి నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనం మొత్తం పూర్తిగా వర్షానికి ఉరుస్తుందన్నారు. భవనం చాలా రోజుల క్రితం నిర్మించడంతో పైకప్పు పెచ్చులుడి పడుతున్నాయన్నారు. వైద్య సిబ్బంది, రోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి, నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానన్నారు. అనంతరం పలు గ్రామాల్లో ప్రవహిస్తున్న వాగులను పరిశీలించారు. ప్రజలు అత్యవసరం అనుకుంటేనే తప్ప ఇళ్ల నుంచి బయటికి రావద్దన్నారు. పోలీసులు రెవెన్యూ సిబ్బంది ప్రజలు వాగుల వద్దకు వెళ్లకుండా చూడాలని చెప్పారు. రోడ్లపై ప్రవహిస్తున్న వాగులను దృష్టిలో పెట్టుకొని దారులను మూసివేయాలని సూచించారు. ఆయన వెనుక పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, నాగిరెడ్డి ఉన్నారు.

గౌడకుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

మొయినాబాద్: గౌడ కుల హక్కుల పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఆదివారం గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వామిగౌడ్ మాట్లాడుతూ.. గౌడ కుల వృత్తి అభివృద్ధికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గౌడలంతా ఐకమత్యంతో పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని.. కులవృత్తిని కొనసాగించాలన్నారు. ఈత, తాటి వనాలను పెంచడానికి ప్రభుత్వం భూమిని కేటాయించి ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సందర్భంగా గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా చిలుకూరుకు చెందిన సిద్ధంతి నర్సింహగౌడ్,ఉపాధ్యక్షుడిగా సురంగల్‌కు చెందిన అశోక్‌గౌడ్‌ను నియమించారు. మొయినాబాద్ మండల అధ్యక్షుడిగా అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణగౌడ్, మహేష్‌గౌడ్, భిక్షపతిగౌడ్‌ను నియమించారు.

దాడి ఘటనలో పలువురికి రిమాండ్

కొత్తూరు: మండలంలోని జేపీదర్గా ఆవరణలో ఇటీవల చోటు చేసుకున్న ఇరు వర్గాల దాడి ఘటనలో ఓ టీవీ రిపోర్టర్ ఫయాజ్‌తో పాటు పలువురిని నిందితులుగా పేర్కొంటూ కొత్తూరు పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ జి.శ్రీనివాస్ వివరాల మేరకు.. ఇన్ముల్‌నర్వకు చెందిన ఫయాజ్ మునావర్ గతంలో ఆయా టీవీ చానళ్లలో పనిచేస్తూ పలువురి వద్ద మామూళ్లు వసూలు చేసేవాడు. అతడి వేధింపులు భరించలేని బాధితులు సంబంధిత చానళ్ల యాజమాన్యాలకు ఫిర్యాదు చేయడంతో అతడిని తమ సంస్థల నుంచి తప్పించారు. ఈ క్రమంలో మరో టీవీ చానల్‌లో చేరి జేపీదర్గా సబ్ కాంట్రాక్టర్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేశాడు. ఒకేసారి వారి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేయడంతో వారు నిరాకరించడంతో తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఫయాజ్, అతని అనుచరులు షౌకత్, సాధిక్, జమీల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రేతలకు..

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి విక్రయేతలను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐలు రాజు, వెంకటేశ్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోష్ సర్కార్ (78), బిస్వజిత్ మధు (31) ఒడిశా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి ఆదిబట్ల, కొంగరకలాన్ సమీపంలో కూలీలకు విక్రయిస్తున్నారు. కొంగరకలాన్ కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

రుద్రారం చోరీని ఛేదిస్తాం

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



పెద్దేముల్ ఠాణాలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

పెద్దేముల్: మండల పరిధిలోని రుద్రారంలో జరిగిన చోరీ కేసును త్వరలోనే ఛేదిస్తామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పెద్దేముల్ పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాండూరు రూరల్ సీఐ అశోక్, పెద్దేముల్ ఎస్‌ఐ గిరితో కేసు గురించి చర్చించినట్లు సమాచారం. సుద్దగుతంలో గ్రామానికి చెందిన రమేశ్ మృతి చెందిన కేసు విషయంలో ఆరా తీసినట్లు తెలుస్తోంది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రతలు తీసుకోవాలని డీఎస్పీ పెద్దేముల్ ఎస్‌ఐ గిరికి ఆదేశించారు. తట్టెపల్లి శివారులో సోమవారం నిర్వహించే అంబురామేశ్వర జాతరకు అన్ని ఏర్పాటు చేయాలన్నారు.

కారును ఢీకొట్టిన డీసీఎం

డ్రైవర్ దుర్మరణం



చేతక్ ఆనంద్‌రావు మృతదేహం



ఘటనా స్థలిలో నుజ్జునుజ్జయిన వాహనాలు

పూడూరు: కారును డీసీఎం ఢీకొట్టిన ప్రమాదంలో కారు డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామలో లోహెర ఆర్గానిక్ ఫామ్‌లో మహారాష్ట్రకు చెందిన చేతక్ ఆనంద్‌రావు(25) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఫామ్‌కు చెందిన వాహనంలో పాలు, కూరగాయలు తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై కేశవరెడ్డి పాఠశాల మలుపు వద్ద మన్నెగూడ నుంచి పరిగి వైపు ప్రయాణిస్తున్న డీసీఎం కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ ఆనంద్‌రావుకు తీవ్రగాయాలతో కారులోనే ఇరుక్కుని మృత్యువాతపడ్డాడు. ఫామ్ మేనేజర్ అభిషేక్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.